క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో మధురానగర్ హైస్కూల్ పీడీ తబిత

సీతంపేట : స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)కు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న పి.జగన్నాథం అండర్ 14 విభాగంలో ఈ నెల 26 నుంచి 28 వరకు తెనాలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆడనున్నట్టు స్కూల్ హెచ్ఎం శాంతికుమారి తెలిపారు. అలాగే 10వ తరగతి విద్యార్థిని మహాలక్ష్మి అండర్ 17 బాలికల విభాగంలో హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం శాంతికుమారి, పీడీ తబిత అభినందించారు.

20న చిత్రలేఖన పోటీలు

సీతంపేట : అక్కయ్యపాలెంలో గల ఏబీయా అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20న 'ఏ డే ఆఫ్ ఆర్ట్' కార్యక్రమంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ డైరెక్టర్ ఎన్.ఉషారాణి తెలిపారు. 'సోషల్ మీడియా దుష్ప్రభావాలు' అనే అంశంపై పిల్లలకు ఉదయం చిత్రలేఖన పోటీలు, పెద్దలకు సాయంత్రం పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని, పాల్గొనదలచే వారు 9515653968, 9573203455లో సంప్రదించాలని సూచించారు.

19 నుంచి అన్నసమారాధన

సీతంపేట : ఎరుమేలి అయ్యప్ప అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో ఏటామాదిరిగానే ఈ నెల 19 నుంచి అయ్యప్ప దీక్షా స్వాములకు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు ఆస్పత్రి ఎదురుగా ఖాళీ స్థలంలో శనివారం ప్రారంభిస్తామని... డిసెంబరు 2 వరకు సుమారు 45 రోజులపాటు అన్నసమారాధన కొనసాగుతుందని తెలిపారు. అయ్యప్ప దీక్షాధారణ స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్ జిల్లాకు చెందిన బసవరాజ్ వద్దర్ బ్యాగులు తనిఖీ చేయగా 18 కేజీల గంజాయి గుర్తించారు. గంజాయి సీజ్ చేసి, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్న జీఆర్పీ సిబ్బంది రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్షం రోజులుగా అంధకారం

- 54వ వార్డులో వెలగని వీధిలైట్లు
- చీకటి రహదారుల్లోనే రాకపోకలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



విద్యుత్ లైట్లు వెలగక చీకటిమయమైన బాపూజీనగర్ - 2లో ఓ ప్రాంతం



బాపూజీనగర్ - 1లో వెలగని విద్యుత్ లైట్లు

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం పరిధి 104 ఏరియా, బాపూజీనగర్ - 1, 2 ప్రాంతంలో విద్యుత్ వీధి లైట్లు వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. పక్షం రోజులుగా ఈ ప్రాంతాల్లో అంధకారం నెలకొన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళ చీకటిలోనే స్థానికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మహిళలు, చిన్నపిల్లలైతే ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టాలంటేనే హడలిపోతున్నారు. జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో వీధుల్లో కుక్కల బెడదతోపాటు దొంగతనాల జోరు ఎక్కువగా ఉంది. ఇటీవల ఫిర్యాదులు చేస్తే లైట్లు వేసిన రెండు రోజులకే మళ్లీ చీకట్లు కమ్ముకున్నాయి. గత పది రోజులు దుర్గా నవరాత్రుల్లో భాగంగా వేదిక వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ లైట్లతో చీకట్లు కనిపించకపోవడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదని, నవరాత్రులు ముగియడంతో చీకట్లు కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి 9 గంటల తర్వాత కూడా మేఘాల వెలుగులో రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. వార్డులో ప్రజాప్రతినిధుల జాడ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో రెండు రోజుల్లో విద్యుత్ లైట్లు వెలగకపోతే జోన్ - 5 జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. ఇప్పటికైనా జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాకపోకలకు ఈ చీకటి రోడ్డే దిక్కు

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

మురళీనగర్ : మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో గురువారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వనితా భవన్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబరు 4న సర్వసభ్య సమావేశం, 9న బాలబాలికలకు ఆటల పోటీలు, 14న బాలల దినోత్సవం, 19న ఇందిరా గాంధీ జయంతి, 24న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం నూతన కమిటీ నియామకంపై చర్చించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ - 101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, క్లబ్ కార్యదర్శి ఎం.జయ, జాలీ వాకర్ ఎం.ప్రమీలారావు, సంయుక్త కార్యదర్శి కె.భానుమతి, కార్యవర్గ సభ్యులు సీహెచ్ జ్యోతి, కౌర్, ఎం.స్వాతి మాధురి పాల్గొన్నారు.



వనితా వాకర్స్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార : నగరంలోని హెచ్‌టీ లైన్ల మరమ్మతులు, చెట్ల తొలగింపు పనుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ జోన్ - 1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. శాంతిపురం, గురుద్వారా ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్, 11 కేవీ ఎన్‌జీజీవోస్ కాలనీ ఫీడర్ పరిధిలో చేపడుతున్న నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు, సాయిబాబా గుడి ఏరియా, రామచంద్రనగర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఆస్పత్రిని పోర్టు యాజమాన్యమే నిర్వహించాలి



పోర్టు ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలో ఐఎన్‌టీయూసీ నాయకులు

జోరువానలోనూ ఆగని నిరాహారదీక్షలు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 17వ రోజుకు చేరాయి. జోరువానలో సైతం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు గొర్లె చందు మాట్లాడుతూ పోర్టులో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది కార్మికులు, విశ్రాంత పోర్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పోర్టు హాస్పిటల్ సేవలు పొందుతున్నారన్నారు. అటువంటి ఆస్పత్రిని ప్రైవేటీకరించాలని చూడడం దారుణమన్నారు. పీపీపీ మోడ్‌లో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు పిలుస్తున్నారని, అందుకు వ్యతిరేకంగా పోర్టులో ఉన్న ఆరు ఫెడరేషన్లు రిలే నిరాహారదీక్షల ద్వారా ఉద్యమిస్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకూ పోర్టులో పీపీపీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకిచ్చినవి ఏవీ సత్ఫలితాలు ఇవ్వలేదన్నారు. లీజు పద్ధతిలో ప్రైవేటుకిచ్చిన పోర్టు స్టేడియం, కల్యాణ మండపాల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఆస్పత్రిని పోర్టు సొంత నిధులతోనే నిర్వహించాలని, అలా కాదని ప్రైవేటు వ్యక్తులకిస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ దీక్షలకు బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి రవి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.సత్యనారాయణ, హెచ్ఎంఎస్ మంగయ్యనాయుడు మద్దతు తెలిపారు. ఎస్పీటీఈయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గురుప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రావు, రమణ, సూర్యనారాయణ, రవి, ఒమ్మి అప్పారావు, సన్నిబాబు, అప్పలనాయుడు, మురళీకృష్ణ, విజయ్‌కుమార్, నాగరాజు, శశి తదితరులు పాల్గొన్నారు.

బోరు పనిచేయక ఇబ్బందులు



నీరు రాని బోరు ఇదే

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి జైప్రకాష్‌నగర్ కొండవాలు ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని ఉన్న మంచినీటి బోరు సక్రమంగా పనిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. 47/16 నంబర్ గల బోరు నుంచి కొద్ది రోజులుగా నీరు రావడం లేదని... అధిక సమయం చేతి పంపును కొడితే కొద్దిగా వస్తోందని చెబుతున్నారు. సుమారు 5 నుంచి 8 నిమిషాల సేపు బోరు కొడితే నీరు వస్తోంది. ఈ విషయం తెలియక అటుగా రాకపోకలు సాగించే వారు బోరు పనిచేయడం లేదనుకుని వెళ్లిపోతున్నారు. జైప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది, చిన్నారుల అవసరాల కోసం ఈ బోరునే వినియోగిస్తున్నారు. సమస్యపై స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య చిన్నదైనా... అవసరం పెద్దదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ - 5 మంచినీటి విభాగ అధికారులు పర్యవేక్షించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథ మృతదేహానికి దహన సంస్కారం

మురళీనగర్ : ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్ స్టేషన్ నుంచి అందిన సమాచారం మేరకు మురళీనగర్ సమీప పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమ నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఒక అనాథ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీ నుంచి గురువారం తీసుకొచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు.

అనాథలు, బంధువుల ఆదరణకు నోచుకోని వృద్ధులకు వానప్రస్థ వృద్ధాశ్రమంలో గత 13 సంవత్సరాలుగా ఆశ్రయమిస్తూ వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ ఆయన మానవీయతను చాటుకుంటున్నారు. దీంతో జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులు ప్రశాంత జీవనం గడుపుతున్నారు. ఆశ్రమంలో గోశాల కూడా నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను చాటుతున్నారు. ఈ నేపథ్యంలో పలు కారణాలతో కేజీహెచ్‌లో వదిలేసిన అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించే కార్యక్రమాన్ని చేపట్టారు. విశాఖపట్నం నగర పరిధిలో అనాథ మృతదేహాల వివరాలు 9666622288కు తెలియజేస్తే దహన సంస్కారాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నర్సుల సంఘానికి 19 నామినేషన్లు

మహారాణిపేట: ఏపీ ప్రభుత్వ నర్సులు సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల కోసం దాఖలు చేసిన నామినేషన్లను గురువారం ఎన్నికల అధికారి బి.శ్రీనివాస్‌రావు పరిశీలించారు. మొత్తం 9 పోస్టులకు గాను 19 మంది నామినేషన్ దాఖలయ్యాయి. నామినేషన్లన్నీ సక్రమంగానే ఉన్నాయని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు.

22న అంతర కళాశాలల గణిత పోటీలు

కంచరపాలెం: విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభాపాటవాలను ప్రోత్సహించే దిశలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో అంతర కళాశాలల గణిత పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ పేర్కొన్నారు. ఈ మేరకు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం గణిత విభాగాధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ సుజాత ఆధ్వర్యంలో ఈ 22న నిర్వహించనున్న గణిత పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నగరంలో పలు కళాశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని, విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు సుజాత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ గౌరీశంకర్, ప్రవీణ్, భారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ, తదితరులు

దేశాభివృద్ధిలో యువత ప్రధాన పాత్ర పోషించాలి

అల్లిపురం: దేశాభివృద్ధిలో యువత ప్రధాన పాత్ర పోషించాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కెరియర్ గైడెన్స్ సెల్, జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా గురువారం కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్-2047, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన జాబితాలో ఉండాలంటే యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. వారి ఆలోచనలు ఆచరణలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ ఎస్.అనురాధ, జే.సునీత, విద్యాకల్పన, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

వైభవునికి పంచామృతాభిషేకం



అభిషేక ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, ఆలయ అర్చకులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు వైభవునికి అర్జిత సేవ నిర్వహించారు. ఇందులో భాగంగా దాతలు, భక్తులు, అర్చకులు మంగళధ్వని, వేదమంత్రోచ్చారణతో అభిషేక ప్రదక్షిణ చేశారు. గురువారం అశ్వయుజ పూర్ణిమ కావడంతో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫల రసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో శ్రీవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వైభవుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గుడి సమీపంలో లిక్కర్‌షాపు



నక్కవానిపాలెంలోని ఆలయ సమీపంలో ఏర్పాటైన మద్యం దుకాణం



సత్యం జంక్షన్ వద్ద ట్రాఫిక్‌జామ్‌కి కారణమవుతున్న మద్యం షాపు

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం పాలసీ వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం దుర్గాదేవి ఆలయం సమీపంలో దర్జాగా మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల, ఆలయాలకు వంద మీటర్ల పరిధిలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదు. ఇక సత్యం జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన వాల్తేరు వైన్స్ దుకాణం ఎదుట వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం కోసం వచ్చేవారు రోడ్డు మీద ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలోనే మద్యం వ్యాపారులు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారంటే.. ముందుముందు ఇంకెంత బరి తెగిస్తారోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిశీలన

పరిశుభ్రత లేకపోవడంతో డీసీపీ - 2 మేరీ ప్రశాంతి అసంతృప్తి



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ - 2 మేరీ ప్రశాంతి

మద్రిపాలెం : కంచరపాలెంలోని ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ - 2 మేరీ ప్రశాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె తొలిసారిగా స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడి పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వచ్చే సమయానికి సీఐ చంద్రశేఖర్ స్టేషన్‌లో లేకపోవడం, కోడిపుంజుల అరుపులు, వాటి వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఆమె స్టేషన్ నుంచి బయటకు వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత స్టేషన్‌కు వచ్చిన సీఐతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. స్టేషన్‌లో అధిక సంఖ్యలో ఫిర్యాదుదారులు ఉండడంపై ఆమె ఆరా తీశారు. ఎందుకు గంటల తరబడి వారిని ఉంచుతున్నారని, త్వరితగతిన ఫిర్యాదులు స్వీకరించి పంపించాలని సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. హనీట్రాప్, పలు పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా తీశారు.

వరద బాధితులకు రూ.2 లక్షల సాయం

సీతమ్మధార : విజయవాడ సమీప బుడమేరు వరద బాధితుల కోసం సీతమ్మధారలో గల లామ్సన్ ఆక్సిజన్ టవర్స్ నివాసితుల వెల్ఫేర్ అసోసియేషన్ రూ.2 లక్షల విరాళం అందజేసింది. ఈ మేరకు బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి రూ.2 లక్షల చెక్కు అందజేశారు. విరాళం అందజేసిన ఆక్సిజన్ టవర్స్ కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి వి.నంబూద్రిప్రసాద్, కోశాధికారి వి.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మండిపోతున్న కూరగాయల ధరలు



తెల్ల వంకాయలు



మార్కెట్లో విక్రయిస్తున్న నల్ల వంకాయలు

- కార్తీకమాసం రాకముందే భారీగా పెరుగుదల
- బెంబేలెత్తిపోతున్న కొనుగోలుదారులు

సీతమ్మధార : కార్తీక మాసం రాకముందే కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఉల్లిపాయలు, టమాటా ధరలతో పోటీపడి మరీ ఇతర కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. భవానీ మాలధారులు ఇప్పటికే విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని దీక్ష పూర్తి చేశారు. కార్తీక మాసంలో అయ్యప్ప తదితర మాలలు వేస్తారు. దీంతో కూరగాయలకు డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతుంటాయి. కానీ ఈ నెలలోనే కూరగాయల ధరలు భగ్గుమనడంతో కొనుగోలుదారులు తక్కువ పరిమాణంలో కొనాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వైపు సముద్రంలో అల్పపీడనంతో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అధిక పరిమాణంలో కూరగాయలు కొనుగోలు చేసి స్టాక్ చేద్దామని రైతుబజార్‌కి వచ్చిన నగరవాసులు ఇక్కడి ధరలు చూసి బెంబేలెత్తిపోతున్నారు. బీన్స్, గ్రీన్‌పీస్ ధరలు సెంచరీ దాటేయడంతో అవాక్కైపోతున్నారు. నల్ల వంకాయల ధర కిలో రూ.60కి చేరుకోవడం గమనార్హం. ఇక ఉల్లిపాయలు రూ.40, టమాటా రూ.50, వెల్లంకి వంకాయలు గత వారం రూ.40 వుండగా, ఇప్పుడు రూ.56, పచ్చిమిర్చి రూ.60, బీరకాయలు రూ.40, కాలీఫ్లవర్ రూ.44, క్యారెట్ గతవారంలో రూ.44 వుండగా ప్రస్తుతం రూ.50కి చేరింది. మునగకాడలు రూ.80, బరబటీ రూ.44, దోసకాయలు రూ.36, పొటల్స్ రూ.66కి చేరుకున్నాయి.

బీన్స్ సెంచరీ దాటేసి రూ.150కి చేరుకోవడం గమనార్హం. బీన్స్ గతవారం ధర కిలో రూ.98గా వుంది. పాత అల్లం రూ.వంద వంతున విక్రయిస్తున్నారు. ఇక క్యాప్సికం రూ.70, కంద రూ.62, దేముడు చిక్కుడు గతవారం రూ.64 వుండగా, ఇప్పుడు రూ.75గా వుంది. బద్ద చిక్కుడు రూ.75, గ్రీన్‌పీస్ రూ.110 పలుకుతోంది. గత గురువారంతో పోలిస్తే పలురకాల కూరగాయల ధరలు రెండు లేదా మూడు రెట్లు పెరిగాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. దీంతో చికెన్, మటన్ వండుకోవడమే బెస్ట్ అనుకోక తప్పదని నిట్టూరుస్తున్నారు. గత వారంతో పోలిస్తే బీరకాయలు, దొండకాయల ధరలు మాత్రమే తగ్గాయి. పెరిగిన ధరలు చూసి బెంబేలెత్తిపోతున్న వినియోగదారులు కిలోకి బదులు అరకిలో లేదా పావుకిలోతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. వర్షాలకు కొన్ని పంటలు దెబ్బతినడం కూడా ధరల పెరుగుదల మీద ప్రభావం చూపిందని అంటున్నారు.

ఏయూ విభాగాల్లో తనిఖీలు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు గురువారం పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం, ఎకనామిక్స్, తెలుగు, సైకాలజీ, హిందీ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో సిబ్బంది హాజరు పట్టికలు, బోధనా విధానాలను పరిశీలించారు.